andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6 • కనిష్ఠం 13.4

కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 12 నవంబరు 2025

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి

● ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం

ఇంటర్వ్యూ



ప్ర: జిల్లాలో మొత్తం ఎన్ని కళాశాలలు ఉన్నాయి. అందులో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?

జ: జిల్లాలో మొత్తం 87 కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలలు 20, ప్రభుత్వేతర 45, ప్రైవేట్ కళాశాలలు 22 ఉన్నాయి. ఇందులో మొత్తం 18,927 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదటి సంవత్సరం 10,060, రెండో సంవత్సరం 8,867 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారు.

ప్ర: జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు?

జ: జిల్లాలో మొత్తం 300 వరకు సిబ్బంది ఆయా కళాశాలల్లో పని చేస్తున్నారు. అందులో రెగ్యులర్, గెస్ట్ అధ్యాపకులు 250కుపైగా ఉండగా మిగిలిన వారు బోధనేతర సిబ్బంది ఉన్నారు.

ప్ర: నూతన కళాశాలల్లో బిల్డింగ్, సౌకర్యాలు, సిబ్బంది కొరత ఉందా?

జ: నూతన కళాశాలలు 5 ఏర్పాటు అయ్యాయి. బిల్డింగ్, సౌకర్యాల కల్పన ఏర్పాటయ్యేవరకు నాగిరెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలోనే కళాశాలను, బీబీపేట ప్రభుత్వ పాఠశాలలోనే కళాశాలను, ఇతర కళాశాలలను స్థానికంగా ఉన్న సౌకర్యాల మేరకు కొనసాగిస్తున్నాం. సిబ్బంది కొరత లేకుండా చూస్తున్నాం. నాలుగు కళాశాలలకు మాత్రం బోధనేతర సిబ్బందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్ర: గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తగ్గింది. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఏం చేస్తున్నారు?

జ: గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తగ్గడం వాస్తవమే. ప్రతీ నెల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మీటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు కళాశాలలకు ఎందుకు హాజరు కావడం లేదో తెలుసుకోవడంతో పాటు వారి ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ విద్యార్థి కోసం ఉదయం, మధ్యాహ్నం వేళలో స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.

ప్ర: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మీరెమైన చర్యలు తీసుకున్నారా?

జ: పలుచోట్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారనేది వాస్తవమే. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు నా దృష్టికి తీసుకువస్తే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాను. ఆర్టీసీ డీఎంలతో చర్చించాం. ఆయా మండలాల్లో విద్యార్థులకు కళాశాలలకు సమయానికి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరాం.

ప్ర: వృత్తి విద్యా కోర్సులు ఉన్నాయా.. ఉంటే ఏఏ కళాశాలలో అందుబాటులో ఉన్నాయి.

జ: ఇంటర్ తర్వాత ఉద్యోగం సాధించేలా జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చాం. దోమకొండ కళాశాలలో ఏఎన్‌టీ, బాన్సువాడలో ఎంపీహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టీ, సీఎస్‌ఈ, బీర్కూర్‌లో ఇంటర్ డెయిరీ టెక్నాలజీ, కామారెడ్డిలో ఎంపీహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీరికి బోధించేందుకు అధ్యాపకులు ఉన్నారు.

● కామారెడ్డి టౌన్, ఆంధ్రజ్యోతి

'అందని'వాడీలు

- అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరత
- నామమాత్రంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- పౌష్టికాహారానికి దూరంగా చిన్నారులు



7

ఉచిత ఇసుక.. పక్కదారి!



రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్మాణ పనులకు ఉచిత ఇసుక సరఫరా చేస్తోంది. అయితే ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతోంది. లబ్ధిదారుల పేరిట స్థానికంగా ఉండే కొందరు చోటా మోటా నేతలు దళారు లు, వ్యాపారులు ట్రాక్టర్‌ల నిర్వాహకులు ఉచిత ఇసుకను పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

- లబ్ధిదారుని పేరిట జోరుగా ఇసుక వ్యాపారం
- బాన్సువాడ డివిజన్‌లోని మంజీరాలో తవ్వకాలు
- ఒకే వే బిల్లుతో పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్‌ల తరలింపు
- స్థానిక చోటామోటా నేతల అక్రమ ఇసుక దందా
- అడ్డుకుంటున్న అధికారులపై దురుసు ప్రవర్తన
- కామారెడ్డి, ఎల్లారెడ్డిలో ఇసుక కొరత
- పర్మిట్‌లు ఇస్తున్న స్థానిక వాగుల్లో లభ్యం కాని ఇసుక
- మంజీరాలోనే ప్రత్యేక రీచ్ ఏర్పాటు చేయాలంటున్న లబ్ధిదారులు

కామారెడ్డి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సంబంధిత శాఖాధికారులు అడ్డుకుంటే చోటామోటా నేతలు అధికారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ఏమి చేయలేక అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నామని వాపోతున్నారు. అయితే బాన్సువాడ డివిజన్ పరిధిలో ఇలా ఉంటే కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్‌లలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత ఎదురవుతోంది. ఇసుక దొరకక ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. ఇక్కడ ప్రాంతాల లబ్ధిదారులకు మంజీరాలో ప్రత్యేక రీచ్‌లను ఏర్పాటు చేసి తక్కువ ధరకు ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ నెలకొంటుంది.

మంజీరాలో ఇసుక అనుమతులు

జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో మంజీరా నది ఉంది. ఈ నది పొడవున ఇసుక మేటలు చాలానే ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తోంది. దీంతో జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను తీసుకెళ్లేందుకు మంజీరాలో స్థానిక రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. బిచ్కుంద మండలంలోని పుల్కల్, (మిగతా 8లో..)





బీర్కూర్, బిచ్కుందలో మంజీరా నది నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ట్రాక్టర్‌లకు ఎలాంటి ఫ్లెక్సీలు పెట్టకుండా ఇసుక తరలిస్తున్న దృశ్యాలు



పద్మను సన్మానిస్తున్న అధ్యాపకులు

విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి

- ఇంటర్‌బోర్డు డిప్యూటీ సెక్రెటరీ పద్మ

బాన్సువాడ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యాప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఇంటర్‌బోర్డు డిప్యూటీ సెక్రెటరీ పద్మ అధ్యాపకులకు సూచించారు. మంగళవారం ఆమె బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. కళాశాల రికార్డులను, వసతులను పరిశీలించారు. రాబోయే పరీక్షల్లో ఉత్తీర్ణత పెరిగేలా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులున్నారు.

15న బీసీ ఆక్రోశ సభ

కామారెడ్డి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 15న బీసీ ఆక్రోశ సభను నిర్వహిస్తున్నట్లు బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారాధన్ మహరాజ్, 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవులు తెలిపారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సభకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టకుండా అడ్డుకుంటున్న బీజేపీపై, బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్న బీఆర్‌ఎస్‌పై, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్య మోసాలపై బీసీ సమాజానికి వివరించడానికి ఈ బీసీ ఆక్రోశసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సత్యకన్వెక్షన్‌లో కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు, వెంకట్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూమోనియాపై.. అప్రమత్తత అవసరం



- చలి కాలంలో పిల్లలు, వృద్ధులకు న్యూమోనియా ముప్పు
- వ్యాధి నిరోధకశక్తి తక్కువ గల వారిపై వైరస్‌ల దాడి
- ఈ ఏడాది 50కిపైగా న్యూమోనియా కేసుల నమోదు

నేడు ప్రపంచ న్యూమోనియా దినం

కామారెడ్డి టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలికాలం మొదలైంది. దాంతో పాటే జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూజ్వరం, ఆయాసం కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా న్యూమోనియా, ఆస్తమా, అలర్జి తదితర శ్వాసకోశ వ్యాధులు అక్కడక్కడ కనిపించడంతో వాతావరణ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ప్రధానంగా అప్పుడే పుట్టిన శిశువు నుంచి న్యూమోనియా లాంటి వ్యాధి ప్రతీ ఏడాది వేధిస్తోంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఆయా ఆసుపత్రుల్లో రోజుకు ఇద్దరి నుంచి ముగ్గురు చేరి చికిత్స పొందుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు 50కిపైగా న్యూమోనియా కేసులు నమోదైనట్లు సమాచారం. నేడు ప్రపంచ న్యూమోనియా దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

జాగ్రత్తలు తీసుకోవాలి

- శ్రీనివాస్, ప్రభుత్వ పిల్లల వైద్యుడు

వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నపిల్లలు, వృద్ధులు న్యూమోనియా భారిన పడుతుంటారు. బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు ముఖానికి మాస్క్ అడ్డుపెట్టుకోవడం చాలా మంచిది. వ్యాధిగ్రస్థులు కోలుకోవడానికి వైద్యులు రాసిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. పిల్లలకు ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన ఆహారం అందేలా తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో న్యూమోనియాకు సంబంధించిన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

న్యూమోనియాతో ప్రాణాల మీదకు..

ఊపిరితిత్తులకు వ్యాధి సోకి ప్రాణాలు తీసే వ్యాధుల్లో న్యూమోనియా ఒకటని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలకు ఈ వ్యాధి సోకినప్పుడు ఊపిరితిత్తులు ఉబ్బి శ్వాస తీసుకోవడం కష్టమవుతోంది. అంతేకాదు వేగంగా ఊపిరి పీల్చుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం అప్పుడే పుట్టిన పిల్లల్లో ప్రతీ ముగ్గురిలో ఒకరు న్యూమోనియా భారిన పడుతున్నారు. చలికాలంలో ఈ వ్యాధిసోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి భారిన పడకుండా ఉండవచ్చని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరానికి గాను ప్రపంచ న్యూమోనియా దినం యొక్క థీమ్ పిల్లల మనుగడకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

చలి కాలం జరభద్రం

వాతావరణం చల్లగా మారడంతో వైరస్‌లు శక్తివంతమై వ్యాధులకు గురిచేస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య చలికాలంలో ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వారిలో వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండడంతో న్యూమోనియా భారీన పడుతున్నారు. దగ్గు, కళ్లు ఎర్ర బడడం, దగ్గినప్పుడు రక్తం పడడం, ఆయాసం, అలసట, ఛాతిలో నొప్పి, ఊపిరి పీల్చుకోవడం, జ్వరం, తీవ్రరూపం దాల్చుతుందంటున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడ్వాయి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని మక్క కొనుగోలు కేంద్రం, కృష్ణాజివాడి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు సజావుగా సాగాలన్నారు. మక్క రైతులతో మాట్లాడుతూ పంట ఉత్పత్తి, ధరలు, ఆదాయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మక్క పంట, వరి పంట వల్ల కలిగే లాభాలు అడిగి తెలుసుకున్నారు. మక్క పంట సాగు చేయడం వల్ల వరి కంటే ఎక్కువ లాభం పొందుతున్నానని, క్రాఫ్ తొందరగా అవుతుందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని రైతు వివరించారు. ఈ సందర్భంలో రైతు తన కొడుకుతో కలిసి కొనుగోలు కేంద్రం వద్ద కనిపించగా, కలెక్టర్ ఆ బాలుడిని పాఠశాలకు ఎందుకు వెళ్లలేదని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తల్లిదండ్రులకు సూచిస్తూ, పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపడం ప్రతీ తల్లిదండ్రుల బాధ్యత. పిల్లల భవిష్యత్తు కోసం విద్య చాలా ముఖ్యం. చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కలెక్టర్ రైతులతో మాట్లాడి పంటల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో సాగాలని అధికారులకు సూచించారు. హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. లోకల్ యాప్‌లో ఎంట్రీలను ఎప్పటికప్పుడు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ సెక్రెటరి, ఎంపీడీవో, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో 18 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 13 కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించి 2149.5 క్వింటాళ్లను కొనుగోలు చేశామన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ విక్టర్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ రవితేజ, సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, డీసీవో రామ్మోహన్ తదితరులు ఉన్నారు.



కృష్ణాజీవాడిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: మండలస్థాయి అధికారులు ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ (మిగతా 8లో..)

ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'హాస్టళ్లలో గజగజ.. వణికిపోతున్న విద్యార్థులు' అంటూ జిల్లా ఎడిషన్‌లో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన సంబంధిత శాఖ అధికారులు ఆయా హాస్టళ్లలోని విద్యార్థులకు చలి నుంచి రక్షణ కల్పించేందుకు దుప్పట్లు, స్వెటర్లను మంగళవారం పంపిణీ చేశారు. జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థుల పరిస్థితి 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించింది. ఈ పరిశీలనలో జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ కాక చలిలోనే కునుకు తీస్తున్నారు. గతంలో ఇచ్చిన ఒక్కో దుప్పట్లోనే ఇద్దరి చొప్పున విద్యార్థులు పడుకొని ఉండడం పలు హాస్టళ్లలో వసతులు లేకపోవడం వంటి సమస్యలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో స్పందించిన సంబంధిత శాఖాధికారులు జిల్లాలోని పలు హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లను పంపిణీ చేయడమే కాకుండా ఆయా హాస్టళ్లలో చల్లటి ఈదురుగాలులు రాకుండా కిటికీలను, తలుపులను సరి చేశారు.



మద్నూర్ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న వివిధ రాష్ట్రాల బృందం సభ్యులు

భిక్కనూరు మహిళా సంఘాల పనితీరు భేష్

- వివిధ రాష్ట్రాల బృందం సభ్యుల ప్రశంస

భిక్కనూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని మహిళా సంఘాల పనితీరు బాగుందని వివిధ రాష్ట్రాల బృందం సభ్యులు ప్రశంసించారు. మంగళవారం భిక్కనూరు క్లస్టర్‌లోని గణపతి, వీరబ్రహ్మేంద్ర స్వామి, విఘేశ్వర, సరస్వతి సంఘాలను ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఆర్‌ఎల్‌ఎం బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయాసంఘాలలో బృందం సభ్యులు ఎస్‌హెచ్‌జీ కట్ ఆఫ్ షీట్స్, ఆడిట్ రిపోర్ట్స్‌ను పరిశీలించి సంఘాల పనితీరు, రుణాలు తీసుకోవడం, చెల్లించడం, బుక్ కీపింగ్, సంఘ సభ్యుల ఆర్థిక పరిస్థితులు, తదితర విషయాలను సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఏపీఎం సాయిలు, సీసీలు జయశ్రీ, రమేష్, వీవోఏలు, ఆయా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం

- జిల్లాలో యాసంగి సీజన్‌లో 4,04,595 ఎకరాల్లో పంటల సాగు లక్ష్యం
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల సాగు కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మాల్తుమ్మెద విత్తన క్షేత్రానికి విచ్చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 4,04,595 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసే లక్ష్యం పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 2,46,500 ఎకరాల్లో వరి, 72,200 ఎకరాల్లో జొన్న, 38,500 ఎకరాల్లో శనగ, 34,420 ఎకరాల్లో మక్కలు, 2,550 ఎకరాల్లో మినుములు, 2,550 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పువ్వు, 720 ఎకరాల్లో గోధుమ పంట సాగు కానున్నాయని ఆయన తెలిపారు. జిల్లాలో యాసంగి సీజన్‌కు గాను 78 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు, 11,400 క్వింటాళ్ల శనగ విత్తనాలు, 3,400 క్వింటాళ్ల జొన్న విత్తనాలు, 3,400 క్వింటాళ్ల మక్క విత్తనాలు అవసరం కానున్నాయన్నారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపించినట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లాలో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక లక్షా 23 వేల 992 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో 50 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు 30 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో జనుమును సాగు చేయనున్నట్లు తెలిపారు. బొప్పాస్‌పల్లి విత్తన క్షేత్రంలో ప్రస్తుత యాసంగిలో 120 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు తెలిపారు. 110 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో జనుమును సాగు చేయనున్నట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విత్తన క్షేత్రంలో ఏడీఏ ఇంద్రసేన్ పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై దృష్టి సారించాలి

- జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి

కామారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సైన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి తెలిపారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన విషయ పరిజ్ఞానం గల ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. ప్రభుత్వం ఈ విధంగా మంచి అవకాశాలను కల్పిస్తుందని వీటిని బాల, బాలికలు సద్వినియోగం చేసుకొని సమాజానికి బాగుపడే విధంగా విద్యార్థులు తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు, సీనియర్ ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి

క్రైం సమాచారం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నరసింహారావు (ఫైల్)

బీర్కూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నర్సింహారావు(65) మంగళవారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నర్సింహారావు కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. మంగళవారం ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లాడు. పోచారం కాలనీ సమీపంలోని గొల్ల సంఘం భవనం దగ్గర అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి చేరుకుని అతడిని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని ఒకరు..

ఇందల్వాయి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని ఒకరు మరణించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడి దగ్గర లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కోటగిరి మండలం రాయకూరుకు చెందిన సురేష్(30)గా గుర్తించామని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్..


శ్రీదేవి(ఫైల్)

రెంజల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండిగుట్ట మాజీ సర్పంచ్ ముళ్లపూడి శ్రీదేవి(50) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గ్రామ మాజీ సర్పంచ్ శ్రీదేవి హఠాన్మరణం తీరని లోటని మండల ప్రజాప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

వేల్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోనిపచ్చల నడ్కుడలో తోకల భూమేష్‌కు చెందిన పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మరణించింది. రోజూ మాదిరిగానే కాపరి పశువులను మేతకు తీసుకువెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ వద్ద ఉన్న గడ్డిని మేస్తున్న సమయంలో విద్యుత్ వైరు తగిలి మరణించింది. దీంతో గేదె యజమాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తు ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నందిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న చేపల మార్కెట్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. మృతుడికి 55-60 ఏళ్లు ఉంటాయన్నారు. బస్టాండ్ ఏరియాలో భిక్షాటన చేసేవాడని అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి (8712659861), నందిపేట ఎస్సై శ్యామ్‌రాజ్(8712659859)ను సంప్రదించాలన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నెపల్లికి చెందిన నీరడి శ్రీను(42) అదృశ్యమయ్యాడని ఎస్సై తిరుపతి తెలిపారు. గతంలో ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన శ్రీను ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడన్నారు. కుటుంబ కలహాలతో గత నెల 26న బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదని పేర్కొన్నారు. భార్య నీరడి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు

సుభాష్‌నగర్, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జైలు శిక్ష, 25 మందికి జరిమానా విధించినట్లు ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 45మంది పట్టుబడ్డారన్నారు. వారిని మంగళవారం జిల్లా కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం తీర్పునిచ్చారన్నారు. 25 మందికి కలిపి రూ.2.32 లక్షల జరిమానా విధించినట్లు వివరించారు.

కోటగిరి: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. నాందేడ్ జిల్లా నాయ్‌గావ్ జిల్లాకు చెందిన శంకర్‌ను బోధన్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శేషతల్పసాయి నిందితుడికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారన్నారు.

సిరికొండ:డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురిని ఆర్మూర్ కోర్టులో హాజరు పర్చగా.. మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి 4 రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఎస్సై రామకృష్ణ తెలిపారు. జైలు శిక్ష పడిన వారిలో ఇద్దరు కొండాపూర్, పెద్దవాల్గోట్, సిరికొండ నుంచి ఒక్కొక్కరున్నారని పేర్కొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడ్డ ఇద్దరికి ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి గట్టు గంగాధర్ 2రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు.

నవీపేట: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి కోర్టు 4 రోజుల చొప్పున జైలుశిక్ష విధించిందని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండలంలోని కమలాపూర్‌కు చెందిన ముల్కాల అభిలాష్, నవీపేటకు చెందిన నేతికుంట మోహన్‌లకు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు వెల్లడించారు.

ఇందల్వాయి: మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ కాత్రోత్ రవి, నర్సయ్యను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. రవికి ఏడు రోజులు, నర్సయ్యకు 4 రోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు. మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.11 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యామూర్తి తీర్పునిచ్చారని వెల్లడించారు.

హెల్మెట్.. లేకుంటే ప్రాణాలు ఫట్



- వాహనదారుల్లో కనిపించని మార్పు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఏడాదిలో 80 మంది మృతి
- 174 మందికి గాయాలు
- లఘుచిత్రం రూపొందించిన ఏర్గట్ల పోలీసులు

రోడ్డు ప్రమాదాలు జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. ద్విచక్రవాహనదారులు నిర్లక్ష్యంతో హెల్మెట్ ధరించకుండా ప్రయాణించి ప్రమాదాల్లో ప్రాణాలు వదులుతున్నారు. ఏడాది కాలంలో ఆర్మూర్ డివిజన్‌లో హెల్మెట్ లేకుండా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 80 మంది మరణించగా.. 174 మందికి గాయాలయ్యాయి. హెల్మెట్ ధరించాలనే ఉద్దేశంతో ఏర్గట్ల పోలీసులు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. షార్ట్ ఫిలీం రూపొందించడం, హెల్మెట్ల పంపిణీ వంటికార్యక్రమాలు చేపడుతున్నారు. - ఏర్గట్ల

సందేశాత్మకంగా.. సరికొత్తగా..

ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఏర్గట్ల పోలీసులు హెల్మెట్ అనే షార్ట్ ఫిల్మ్ తీశారు. ఉదయం పాఠశాలకు బస్సులో వెళ్తున్న విద్యార్థుల కళ్ల ముందే కారును ఎదురుగా వస్తున్న బైక్ వేగంగా ఢీకొట్టడంతో బైక్ మీద వచ్చిన వ్యక్తి వారి కళ్ల ముందే మరణిస్తాడు. బడికి వెళ్లిన విద్యార్థులు క్లాస్ రూమ్‌లో చింతిస్తూ ఉండగా.. ఇది గమనించిన టీచర్ ఏమైంది అని అడగగా.. జరిగిన విషయం చెప్తారు. దాంతో టీచర్ తమ పాఠశాలకు వచ్చే ఓ ఉపాధ్యాయుడి హెల్మెట్ తెప్పించి, హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగే నష్టాలు, ధరించడం వల్ల ఉపయోగాలను వారికి వివరిస్తారు. ఇంట్లో పిల్లల తల్లిదండ్రులు కూడా బైక్‌పై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేల తెలపాలన్న సందేశాన్ని ఇచ్చారు. ఈ షార్ట్ ఫిల్మ్‌లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులను కలిసి ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ అభినందించారు. వారితో ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. సోషల్ మీడియాలో ఈ షార్ట్ ఫిలీం ఎంతో ఆదరణ పొందుతోంది. ఈ చర్యలు చేపడుతున్న ఎస్సై రాజేశ్వర్‌ను సీపీ సాయిచైతన్యతో పాటు ఇతర అధికారులు అభినందించారు.


షార్ట్‌ఫిలిం ఆవిష్కరిస్తున్న సీపీ సాయిచైతన్య(ఫైల్)

హెల్మెట్ వాహనదారులకు రక్షణ కవచం..

హెల్మెట్ ధరిస్తే ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ప్రాణాలతో బయటపడొచ్చు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించక విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రాణానికి రక్షక కవచంగా ఉండే హెల్మెట్‌ను ధరించేలా అవగాహన కల్పించాలని 'హెల్మెట్' అనే పేరుతో షార్ట్ ఫిలీం తీశాం. ప్రతీఒక్కరు దానిని చూసి మారాలని కోరుకుంటున్నాం. **- పడాల రాజేశ్వర్, ఎస్సై, ఏర్గట్ల**


ప్రవాస ప్రజావాణిలో విజ్ఞప్తి చేస్తున్న భూక్య సుగుణ

నా భర్తను ఇంటికి రప్పించండి

- కువైట్‌లో హాసాకొత్తూర్‌వాసి ఈశ్వర్ అదృశ్యం
- ప్రవాస ప్రజావాణిలో ఈశ్వర్ భార్య సురేఖ వినతి

కమ్మర్‌పల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని హాసాకొత్తూర్ మారుతినగర్‌కు చెందిన తన భర్త భూక్య ఈశ్వర్ కువైట్ తప్పిపోయాడని తన భర్త ఆచూకీ తెలుసుకుని ఇంటికి చేర్చాలని అతడి భార్య భూక్య సుగుణ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాస ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. 15ఏళ్లుగా తనభర్త కువైట్‌లో ఉంటున్నాడని రెండేళ్లకోసారి వచ్చివెళ్లేవాడని పేర్కొన్నారు. ఈసారి ఇంటికి వస్తున్నట్లు తెలిపాడని, కానీ 25రోజులుగా జాడ లేదన్నారు. అక్కడుంటున్న వారిని వాకాబుచేస్తే తమకు తెలవదని అంటున్నారని వాపోయారు. తన భర్త ఆచూకీ తెలుసుకొని స్వదేశానికి రప్పించాలని కోరారు. దీనిపై కువైట్‌లోని ఎంబసీ అధికారులతో మాట్లాడి ఈశ్వర్‌ను తీసుకొస్తామని ప్రవాస ప్రజావాణి ఇన్‌చార్జ్, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్రగల్ఫ్ అడ్వైజరీ కమిటి వైస్ చైర్మన్ భీమ్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆమె వెంట కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, కుటుంబీకులు ఉన్నారు.

క్వారీ పరిశీలన

కోటగిరి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చామని పోతంగల్ తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. పోతంగల్ మండలంలోని కొడిచర్ల మంజీర నదిలో 334 సర్వే నెంబర్‌ను మంగళవారం తహసీల్దార్ మైనింగ్, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన 12మందిపై ఫిర్యాదు చేశామన్నారు. ఆయనవెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సై సునీల్ మైనింగ్ అధికారులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మెప్మా డీఎంసీ మాధురిలత, ఆర్మూర్ మునిసిపల్ కమిషనర్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా డీఎంసీ మాధురిలత, పాల్గొన్న అధికారులు

ఆర్మూర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని మెప్మా డీఎంసీ మాధురిలత, మునిసిపల్ కమిషనర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం పెర్కిట్ మహిళాభవన్‌లో పట్టణ సమాఖ్య మహాజన సభకు వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను గతేడాదిలాగే సాధించాలన్నారు. మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని మొండి బకాయిలు ఉంటే రికవరీ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వార్షిక నివేదిక చదివి వినిపించారు. తర్వాత నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నూనె చందన, కార్యదర్శిగా సింధూజ, కోశాధికారిగా సరిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు హక్కులను తెలుసుకోవాలి

బోధన్ కోర్టు అదనపు మొదటి శ్రేణి న్యాయమూర్తి సాయిశివ



మాట్లాడుతున్న న్యాయమూర్తి సాయిశివ

బోధన్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి హక్కులతో పాటు విధులను తెలుసుకోవడమే అసలైన విద్యకు నిర్వచనమని బోధన్ కోర్టు అదనపు మొదటి శ్రేణి న్యాయమూర్తి సాయిశివ అన్నారు. పట్టణంలోని ఇందూర్ మోడల్ హైస్కూల్‌లో మంగళవారం న్యాయసేవ సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గురువులను దైవంతో సమానంగా చూడాలని వివరించారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్ రావు, సమ్మయ్య, గవర్నమెంట్ ప్లీడర్ రవీందర్, న్యాయసేవా సంస్థ సభ్యులు సీహెచ్‌వీ హన్మంత్ రావు, కళ్యాణి, అజయ్ కుమార్, జమీల్ హైమద్, పట్టణ ఎస్సై భాస్కరచారి, స్కూల్ కరస్పాండెంట్ కిషోర్, ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

జిల్లా ఎన్జీఓఎస్ అధికారి శివసాయి


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

వేల్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరికొయ్యలను కాల్చడం వల్ల అపార నష్టాలు ఉంటాయని జిల్లా ఎన్జీఓఎస్ కేంద్రం శాస్త్రవేత్త శివసాయి, వేల్పూర్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పడిగెల, అంక్సాపూర్‌లో వరి కొయ్యల కాల్చివేతపై అవగాహన కల్పించారు. వరికోతల తర్వాత వాటి అవశేషలను రైతులు కాల్చవద్దని, దాని ద్వారా భూమిలో మేలు చేసే మిత్రపురుగులు, భూమి సారవంతం కోల్పోతుందన్నారు. మట్టిలోని సూక్ష్మజీవాలు దెబ్బతిని భూమి సంతు లనం కోల్పోతుందని వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ చింత శ్రీనివాస్, హార్టికల్చర్ ఆఫీసర్ రాజు, ఏఈవో సాయిరాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ సభ్యులు

లయన్స్ క్లబ్ కమిటీ ఎన్నిక

ఏర్గట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ మండల నూతన అధ్యక్షుడిగా తుపాకుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ గవర్నర్ అమర్నాథ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయగా, కార్యదర్శిగా చిరంజీవి, క్యాషియర్‌గా శ్రీరాముల శ్రీనివాస్, సభ్యులుగా రాజేశ్వర్, వెంకటేష్, శ్రీధర్, వెంకట్‌గౌడ్, రమేష్, రత్నయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సుధీర్‌బాబు,రాజన్న,సంజీవ్, సత్యనారాయణ ఉన్నారు.

దోపిడీ లేని వ్యవస్థ కోసం పోరాడాలి


మాట్లాడుతున్న జిల్లా న్యూడెమోక్రసీ కార్యదర్శి పాపయ్య

ఆర్మూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, కోసం, దోపిడీ లేని వ్యవస్థ కోసం పోరాడడమే అమరులకు నిజమైన నివాళి అని జిల్లా న్యూడెమోక్రసీ కార్యదర్శి పాపయ్య, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు అన్నారు. మంగళవారం ఆర్మూర్‌లో అమరవీరుల స్మారక సభ నిర్వహించారు. మోదీ ప్రభుత్వం పదేళ్లలో ప్రజల సొమ్మును బ్యాంక్ ఎగవేతదారులకు, కార్పోరేట్ అధిపతులకు రూ.13లక్షల కోట్లు రాయితీ ఇచ్చి ప్రజలను లూటీ చేసింద న్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా అమ్మేస్తూ ఉపాధిని కొల్లగొడుతున్నారని విమర్శించారు. అమలు కానీ హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, న్యూడెమెక్రసీ ఆర్మూర్ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి సూర్య శివాజీ, నాయకులు అబ్దుల్, మార్క్స్, ప్రిన్స్, దేవన్న, భూమేష్, బాబురావు, నరేందర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోటీతత్వం పెంపొందుతుంది

బీసీ గురుకులాల ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి

జక్రాన్‌పల్లి , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం, సమయపాలన పోటీతత్వం ఏర్పడుతాయని బీసీ గురుకులాల ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మునిపల్లిలో మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలికల జూనియర్, మహిళా డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన అండర్ -14, 19 వివిధ క్రీడలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో సత్యనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, చదరంగం వివిధ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో గెలుపొందిన జట్లకు ఆయన బహుతులు అందజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనూష, పీడీలు, పీఈటీలు, పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న అధికారులు

నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ..

రెంజల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫెడరేషన్ అండర్-17 నెట్‌బాల్ పోటీలలో తాడ్‌బిలోలి పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు కుమార్ తెలిపారు. సోమవారం అండర్ -17 నెట్‌బాల్ పోటీలు తిర్మన్‌పల్లిలో నిర్వహించగా తాడ్‌బిలోలి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

కమ్మర్‌పల్లి: కోనాసముందర్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సాహిత్య నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం మధుపాల్, పీడీ రమేష్‌గౌడ్ తెలిపారు. తిర్మన్‌పల్లిలో నిర్వహించిన పోటీల్లో సాహిత్య ప్రతిభ కనబర్చినట్లు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు నల్గొండలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈసందర్భంగా సాహిత్యను ఆమెకు శిక్షణ నిచ్చిన పీడీని హెచ్‌ఎం మధుపాల్, వీడీసీ అధ్యక్షుడు గంగాధర్ ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ క్రీడాకారులకు సీపీ అభినందన

నందిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉజ్వల హైస్కూల్‌కు చెందిన 9మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన జూడో పోటీల్లో మెడల్స్ సాధించారు. శ్రీదిరెడ్డి, రిషితరాజ్, సిద్దునాయక్, మణికంఠ సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజూరి అరుణ్, పీఈటీలు వికాస్, నవీన్ పాల్గొన్నారు.

ఎర్రజొన్న సాగు ఒప్పందంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వేల్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల, అంక్సాపూర్‌లో మంగళవారం ఏవో రాజు ఆధ్వర్యంలో ఎర్రజొన్న సాగు విత్తన ఒప్పందంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన ఒప్పందంపై రైతులు సంబంధిత సమస్య ద్వారా అగ్రిమెంట్ లీగల్‌గా బాండు పేపర్‌పై తీసుకోవాలని సూచించారు. రైతులు పంట దిగుబడి తర్వాత నష్టపోకుండా పండించిన పంటకు సరైన ధర, లాభం చేకూర్చేలా ఒప్పందం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ కల్టివేషన్, సేంద్రియ వ్యవసాయం, వివిధ పంటల సాగు సమస్యలపై సలహాలు, సూచనలు రైతులకు వివరించారు. ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీలు, పసుపు సాగు సమస్యలపై హార్టికల్చర్ అధికారి రాజు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయిరామ్‌రాజ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల బిల్లులు చెల్లించాలి


రుద్రూరు-బోధన్ రహదారిపై నిరసన తెలుపుతున్న దృశ్యం

రుద్రూరు,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇళ్లు మంజూరు అయ్యాయి. కొన్ని బిల్లులు వచ్చిన మిగత బిల్లులు నాలుగు సంవత్సరాల నుంచి రావడం లేదని లబ్ధిదారులు మంగళవారం రుద్రూర్, బోధన్ రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రభుత్వం బిల్లులు ఇచ్చినప్పటికీ అధికారులు తమకు బిల్లులు పంచలేదన్నారు. అధికారులు వెంటనే తమ బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లబ్దిదారులను సముదాయించారు. అనంతరం రుద్రూర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందజేశారు. తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బిల్లులు ప్రభుత్వం మంజూరు చేసిన సదరు అధికారులు, నాయకులు ఇవ్వడం లేదని తహసీల్దార్‌తో వాపోయారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

అర్మూర్‌టౌన్,నవంబరు11 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు అరికట్టి, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు రబీ సీజన్‌కు సంబంధించి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారానే విత్తనాలు అందించాలని పేర్కొన్నారు. దేశంలో 90 శాతం విత్తనాలు ప్రైవేట్ కంపెనీలు అందిస్తున్నాయని, 10శాతం మాత్రమే ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రైవేట్ కంపెనీలు నకిలీ విత్తనాలతో రైతులను నిండా ముంచుతున్నాయన్నారు. బహుళ జాతి విత్తన కంపెనీలను అరికట్టి రైతును, వ్యవసాయాన్ని రక్షించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, కార్యదర్శి మార్క్స్, దేవన్న, భూమేష్, అనంత్‌రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు భూమయ్య

ముప్కాల్‌లో శాకాహార ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యాన సభ్యులు

ముప్కాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం పిరమిడ్ ధ్యాన మండలి ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం, శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అంటు నినాదం చేస్తూ ముప్కాల్ బైపాస్ నుంచి గ్రామ పంచాయితీ వరకు ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్ పత్రీజీఈ జన్మదినం పురస్కరించుకొని మండల కేంద్రంలో ధ్యానకేంద్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ధ్యాన బంధువులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు పంపిణీ చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు

ఆర్మూర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా జిల్లా నాయకుడు ఎం.ముత్తెన్న, ఆర్మూర్ మండల కార్యదర్శి బి.కిషన్ మాట్లాడారు. పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. రాజకీయలకు అతీతంగా పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజాఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ ఆర్మూర్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, ఏరియా అధ్యక్షుడు శేఖర్, పోశన్న, నిఖిల్, రవి, గత, శ్యామల, నిఖిత పాల్గొన్నారు.


సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సుదర్శన్ రెడ్డిని కలిసిన నాయకులు

కమ్మర్‌పల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి జిల్లా రాజకీయాలపై చర్చించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, మైనార్టీ నేత అబ్దుల్ రఫీ, రచయిత ప్రవీణ్ ఉన్నారు.

పశువులకు టీకాలు

ఏర్గట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడపాకల్‌లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రాజ్యలక్ష్మీ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖఅధికారి రోహిత్‌రెడ్డి పాల్గొని సిబ్బందికి సూచనలు చేశారు. పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ పోయిన,చోరీకి గురైన

ఆందోళన చెందొద్దు

- మొబైల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన సీఈఐఆర్‌లో రిజిస్టర్ చేసుకోవాలి
- జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 71 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత
- సెకండ్ హ్యాండ్ మొబైల్స్‌లో చోరీ ముఠాలను గుర్తించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశం



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించారు. నెలరోజుల్లో 71 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన,చోరీకి గురైన ఆందోళన చెందొద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 71 మొబైల్ ఫోన్లు (ఎనిమిది లక్షల యాభై రెండు వలే విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్‌ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈపోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1806 ఫోన్లు (సుమారు రెండు కోట్ల పదహారు లక్షల డెబ్బై రెండు వేల రూపాయల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచిం చారు. వినియోగదారులు సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనే టప్పుడు అవి ఎక్కడి నుంచి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరిచూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతే కాకుండా ఒకే వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్స్ దొరికితే, వారు ఏదైనా చోరీ ముఠా లేదా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని అడిషనల్ ఎస్పీకి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

» నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

ఈకేవైసీ ఉంటేనే గ్యాస్ రాయితీ

» ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒకసారి తప్పనిసరి


వినియోగదారుడికి ఈ-కేవైసీ చేస్తున్న మేనేజర్

భైంసా,నవంబరు11(ఆంధ్రజ్యోతి):రాయితీపై అందిస్తోన్న గ్యాస్‌సిలిండర్ల దుర్వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అనుసరిస్తోంది.ఎల్పీజీ వినియోగదారులు ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక సారి ఈ-కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి చేసింది. వినియోగదారులు తాము వినియోగించే గ్యాస్ కంపెనీ (హెచ్‌పీ, ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం)తదితర మోబైల్‌యాప్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఏం చేయాలంటే

వినియోగదారులంతా ఏజెన్సీ కార్యాలయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయించుకోవచ్చు. లేదంటే డెలివరీ బాయ్‌ల ఫోన్లలో ఉండే యాప్ ద్వారానూ పూర్తి చేసుకోవచ్చు. మూడు నెలలుగా రాయితీ విడుదలలో జాప్యం జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం ఈ-కేవైసీ చేయించుకోకపోవడమే.

తప్పించుకోవొద్దు

ఏడాదికి గరిష్ఠంగా 9సిలిండర్లకు మాత్రమే కేంద్రం సబ్సిడీ ఇస్తోంది. 8,9వ సిలిండర్లు పొందే ముందే ధ్రువీకరణ పూర్తిచేసుకోకపోతే రాయితీని తాత్కలికంగా నిలిపివేస్తారు. ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31లోపు ఈ-కేవైసీ చేయించుకుంటే తిరిగి చెల్లిస్తారు. లేదంటే శాశ్వతంగా రద్దవుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక సారి ఇది తప్పనిసరి.

జిల్లాలో ఇలా..

నిర్మల్ జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో 2,51,785 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం 47,215, ఉజ్వల 37,249, సాధారణ 1,39,430, సీఎస్ఆర్ 26,828, ఇతర 1069 ఉన్నాయి. అయితే 8, 9వ సిలిండర్లు పొందిన తర్వాత చాలా మంది ఈ-కేవైసీ చేయించుకోకపోవడంతో సబ్సిడీ జమ కావడం లేదని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు.

చలికాలం.. ఆరుబయటే చదువులు


ముత్నూర్‌లో విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకురాలు

సిరికొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చలికాలం దృష్ట్యా బయటకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. జిల్లాలో రోజు రోజుకు చలితీవ్రత అధికమవడంతో సాయంత్రం మొదలుకుని ఉదయం 10గంటల వరకు బయటకు రాలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, చలికి గజ గజ వణికిపోతున్నారు. దీంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితి లేక పోవడంతో ఉపాధ్యాయులు అన్ని తరగతులు ఆరుబయటే నిర్వహిస్తున్నారు.

వామ్మో..చలి..!


మార్నింగ్‌వాక్ చేస్తున్న దృశ్యం




» రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు » చలికి జంకుతున్న జనం

ఆదిలాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఏ నోటా విన్నా వామ్మో చలి.. చలిగా ఉంది అనే మాటలే వినిపిస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత కనిపిస్తుంది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు లేక పోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.మంగళవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3 కాగా కనిష్ఠంగా 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 10.2, సాత్నాలలో 10.4, బోథ్ మండలం పొచ్చెరలో 10.5, నేరడిగొండలో 10.7, బేలలో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 20.0 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజు రోజుకు పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలతో పగలు రాత్రి అనే తేడా లేకుండా చలి ప్రభావం కనిపిస్తుంది.ఉదయం రాత్రి చలితో జనం వణికి పోతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లోనైతే చలిప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. చలి మంటలు వేసుకుంటు వెచ్చదనాన్ని పొందుతున్నారు. సాయంత్రం పనులు ముగించుకుని 6గంటలకే ఇంటికి పరిమితమవుతున్నారు.నవంబరు 19 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు. ఉదయం రాత్రి వేళల్లో అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వెళ్లాలని అధికారులు పేర్కొంటున్నారు.

ఇచ్చోడ: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 5గంటలకే శీతల గాలులు వీస్తున్నాయి. ఉదయం ఎనిమిది దాటినా వణుకు తగ్గడంలేదు. రెండు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు ఇళ్ల నంచి బయటికి రావాలంటేనే భయపడతున్నారు. ఉదయం పూట కూర గాయాలు, పాలు తది తర పనులు చేసుకునే వారు చలికి తట్టుకోకపో వడంతో రోడ్డు పక్కన మంటలు కాగి ఉపశమనం పొందుతున్నారు. సాయంత్రం బయటికి వెళ్లాలంటే వెన్నులో వణుకు పడుతుందని ప్రజలు జంకుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.


చలిమంట కాస్తున్న యువకులు


టీని తాగుతున్న మార్నింగ్ వాకర్స్


కమ్ముకున్న పొగమంచులో..

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జపటేల్ సుడిగాలి పర్యటన

ఉట్నూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జపటేల్ మంగళవారం ఉట్నూర్ మండలంలోని సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో పర్యటించి వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ఉదయం లేవగానే మండల కేంద్రంలో మార్నింగ్ వాక్ చేస్తూ (పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు)పేరుతో మార్నింగ్ వాక్ నిర్వహించారు. సుభాష్‌నగర్, సేవదాస్‌నగర్, పోచమ్మగల్లీ, ఫకీర్‌గుట్ట, మెయిన్‌రోడ్‌లోని ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్య ఉన్న చోట వెంట ఉన్న అధికారులను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పర్యటనలో ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మురికి కాలువల సమస్యకు పరిష్కారం దిశగా ప్రణాళిక చేశారు. అవసరం ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన వాటర్ ట్యాంక్స్, అంగడి బజార్, ఐబీ ప్రాంతాల్లో సులబ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం స్థలాలు పరిశీలించారు.వాకింగ్‌లో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మెస్, వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.,

రైతుల ప్రయోజనం కోసం కొనుగోలు కేంద్రాలు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నందున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని షాంపూర్ దాల్మిల్ వద్ద మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రజామిత్ర సహకార సంస్థ ద్వారా సోయాబీన్, మొక్కజోన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సోయాబీన్ క్వింటాల్ ధర రూ.5328 మొక్కజోన్న క్వింటాల్ ధర రూ.2400లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఉట్నూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలోని శాంతినగర్ గ్రామైక్య సంఘంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, వైస్ చైర్మన్ జయవంతరావు, డీసీసీబీ డైరెక్టర్ సామ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రాథోడ్ రవీందర్, ఏపీడీ గోవిందరావు, ఏపీఓ రామారావు, ఆర్డీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, గట్టురమేష్, ప్రజామిత్ర సహకార సంస్థ మేనేజర్లు రాథోడ్‌శేషారావు, కుమ్ర విఠల్‌రావు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఓ రమేష్, దాసండ్ల ప్రభాకర్, ఇక్బాల్, చంద్రయ్య, నందంసాడిగే రాజేశ్వర్, అజీముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చింతగూడ వంతెన పనుల పరిశీలన

మండలంలోని ఘన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే స్వగ్రామం కల్లూరుగూడకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే స్వయంగా మంగళవారం పరిశీలించారు. చింతగూడ చెరువుపై నిర్మిస్తున్న భారీ వంతెన పనులు రోడ్డు భవనాలశాఖ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలించారు.

అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద ఫాస్టాగ్ ఏర్పాటు పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం - తక్షణమే మూసివేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉన్న కొత్తగూడెం అటవి శాఖ చెక్‌పోస్టు వద్ద అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ ఏర్పాటు పట్ల ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలో వివిధ ప్రారంభోత్సవాలు నిర్వహించుకుని తిరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వస్తుండగా కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఫాస్టాగ్‌ను వెంటనే మూసి వేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి ఫోన్ ద్వారా ఎఫ్‌డీపీటీ శాంతారామ్, ఆదిలాబాద్ డీఎఫ్‌ఓలతో ఫోన్లో మాట్లాడి తనకు తెలియకుండా తన నియోజకవర్గంలో ఫాస్టాగ్‌ను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. తాను రాష్ట్ర వన్యప్రాణి విభాగం సభ్యుడిగా ఉన్నానని, ఎమ్మెల్యేగా ఉన్నాని తన పరిధిలోని ఎనిమిది మండలాల ప్రజలకు ఎలాంటి వాహనాల రుసుము లేకుండా అన్ని వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు సేకరించి వాటికి ఫాస్టాగ్‌లో డబ్బులు కట్‌కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీసీసీఎఫ్, అటవీశాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికృష్ణారావుల దృష్టికి తీసుకు వెళ్లి అటవీశాఖ అధికారుల పనితీరు తెలపడం జరుగుతుందన్నారు. కొత్తగూడచెక్‌పోస్టు వద్ద అక్ర మంగా ఫాస్టాగ్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. కవ్వాల్‌టైగర్‌జోన్ పరిధిలో ఫాస్టాగ్ ఏర్పాటు చేయడం తప్పుకాదని ఖానాపూర్ నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఉన్నవాహనాలను లోకల్‌గాపరిగణించి రుసుము మినహాయింపు ఇవ్వాలన్నారు.


ఫాస్టాగ్‌ను మూసి వేయించిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్

వెంటనే మూతపబడ్డ ఫాస్టాగ్...

ఖానాపూర్ ఎమ్మెల్యే చెక్‌పోస్టు వద్ద నుంచి ప్రయాణించగానే అటవీ శాఖ అధికారులు ఫాస్టాగ్‌ను మూసివేశారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఫాస్టాగ్ మూసి వేస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఫాస్టాగ్ మూసి వేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం సమాచారం

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

» గాదిగూడ మండలంలో ఇద్దరిపై కేసు నమోదు



గుడుంబా తయారుదారులను అదుపులో తీసుకున్న ఎస్సై

నార్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతంలోని నార్నూర్, గాదిగుడ మండలాల్లో గుడుంబా తయారిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'గప్పు మంటున్న గుడుంబా' అనే శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు గాదిగూడ మండలంలోని చిత్తగూడ గ్రామ శివారు ప్రాంతం గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. ఆత్రం పగ్గు(71), ఆత్రం ముత్తా (37)ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఆరు లీటర్ల సారా, పది కిలో ఇప్పపువ్వు స్వాధీనం చేసుకున్నట్లు గాదిగూడ ఎస్సై ప్రణయ్‌కుమార్ తెలిపారు. ఆదివాసీ ప్రాంతంలో పోలీసుల పనితీరు బేస్ ఉందంటూ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థి అదృశ్యం

ఇచ్చోడ, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల నుంచి ఈనెల 6వ తేదీన పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈవిషయమై పాఠశాల ప్రిన్సిపల్ కిషన్ చౌహన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పదో తరగతి విద్యార్థి అనికేష్ మధ్యాహ్న భోజన అనంతరం పాఠశాల నుంచి బయటికి వెళ్లాడు. గమనించిన పాఠశాల సిబ్బంది విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మరుసటి రోజు విద్యార్థి బంధువుల ఇంటికి, తెలిసిన వారి ఇంటికి వెళ్లాడేమెనని ఆరాతీశారు. దీంతో ఎంత వెతికిన ఆచూకీ తెలియకపోవడంతో ఈనెల 8వ తేదీన పోలీసులకు పాఠశాల సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ విషయం వాట్సాప్ గ్రూప్‌లలో నార్నూర్ మండలానికి చెందిన బాలుడి ఆచూకీ తెలిస్తే సంప్రదించండి అంటూ సోషల్ మిడియాలో వచ్చిన సమాచారంతో విషయం బయటకు వచ్చింది. ఇప్పటికీ బాలుడి ఆచూకి తెలియరాలేదు.

వేణునగర్ అంగన్‌వాడీ టీచర్‌పై విచారణ



వేణునగర్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

పెంబి,నవంబరు11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని వేణునగర్ గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో ఈ నెల 1న ఇందిరమ్మ ఇంటినిర్మాణం పిల్లర్ గుంతలోపడి ఆత్రం పుష్పమృతి చెందినవిషయం తెలిసిందే. గత నాలుగు రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యం తోనే అంగన్‌వాడీ చిన్నారి పుష్ప మృతి చెందిందని వేణునగర్ గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులు వచ్చి విచారణ చేపట్టారు. జరిగిన విచారణపై అధికారులకు అందిస్తామని తెలిపారు.

బిడ్డకు జన్మనిచ్చి ఫిట్స్‌తో తల్లి మృతి

బోథ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):బోథ్ మండల కేంద్రానికి చెందిన హర్ష అపూర్వ అనే యువతి (25) పండంటి బిడ్డకు జన్మనిచ్చి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన హర్ష విజయేందర్ భార్య అయిన అపూర్వ మొదటి కాన్పులోనే పండంటి కుమారునికి జన్మనిచ్చి హైదరాబాద్ ఆసుపత్రిలో ఫిట్స్ వ్యాధి భారీన పడి సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.అయితే డెలివరీ నిమిత్తం వెళ్లిన ఈమె మృతి చెందడంతో కాలనీలో బంధువులలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం ఆమె స్వగ్రామమైన బోత్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళా మృతికి కారణమైన వ్యక్తికి రిమాండ్



బజార్‌హత్నూర్‌లో నిందితుడి వివరాలను తెలియజేస్తున్న సీఐ, ఎస్సై

బజార్‌హత్నూర్,నవంబరు11 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందిన ఘటనలో నిందితుడిని ఆరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు బోథ్ సీఐ గురుస్వామి తెలిపారు. కాగా పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై సంజయ్ కుమార్‌తో కలిసి సంఘటన వివరాలను తెలిపారు. నవంబరు 9న బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన చెవుల రత్నమాల తన కుమారుడు చెవుల లక్ష్మణ్‌తో కలిసి వ్యవసాయ పనులు ముగించుకొని ఎడ్ల బండిపై ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన తర్లపు ప్రదీప్ అనే కారుతో మద్యం మత్తులో అత్యంత నిర్లక్ష్యం, వేగంగా నడుపుతూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో చెవుల రత్నమాల తలకు గాయమై తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు గాయలతో బయటపడ్డాడన్నారు. పూర్తి దర్యాప్తు చేపట్టగా నిందితుడు మద్యం తాగి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మద్యం తాగి నడిపడం ప్రాణాంతకమని, ఇలాంటి నిర్లక్ష్యపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. వారితో బోథ్ ఎస్సైసాయి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పీవీటీజీ ఇళ్ల నిర్మాణంలో అన్యాయం



అటవీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సంఘ నేతలు

ఆదిలాబాద్‌టౌన్,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న కొలాంలకు పీఎం జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న పీవీటీజీ ఇళ్ల నిర్మాణంలో అన్యాయం జరుగుతోం దని ఆదిమ గిరిజన కొలాం సేవ సంఘం నేతలు అన్నారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అటవీ శాఖ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు రావాల్సిన పీవీటీజీ ఇండ్లతో పాటు సౌకర్యాల కల్పనలో అటవీ అధికారులు అన్యాయం చేస్తున్నారని అన్నారు. పీవీటీజీ ఇళ్ల నిర్మాణంలో అడ్డు పడుతు న్నారని ఆరోపించారు. వెంటనే అధికా రులు స్పందించి తమ సమస్యను పరి ష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు, ఉపాధ్యక్షుడు కుమ్ర రాజు, జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు, వివిధ గ్రామపటేళ్ల తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హుతాత్మ దివాస్


నివాళులు అర్పిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్య కరసేవలో ప్రాణత్యాగం చేసిన కొఠారి బ్రదర్స్ జ్ఞాపకంగా వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కళాశాలలో హుతాత్మ దివాస్ నిర్వహించినట్లు జిల్లాధ్యక్షుడు నిత్యానందం తెలిపారు. ప్రాణత్యాగం చేసిన వారికి నివాళ్లు అర్పించి రక్తదాన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో విభాగ్ సంపర్క ప్రముఖ్ గోపాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి బొల్లిరాజు, జిల్లా భజరంగదళ్ సంయోజక్ ఆకాశ్, సహసంయోజక్ కడెం సాయికుమార్, కామారెడ్డి నగర కార్యదర్శి గడ్డమీది అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గాంధారి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలకేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు మండలకేంద్రంలో మంజూరైన లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు సమానంగా న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించడంతో ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నామని చెప్పారు. చెక్కులను లబ్ధిదారులు వెంటనే తమ తమ ఖాతాల్లో జమ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ తూర్పు రాజు, లైన్ రమేష్, నాయకులు సంగని బాలయ్య, సంగని బాబా, రవి, గోపాల్, పత్తి శివకుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న నాయకులు

అన్నప్రసాద సేవాసమితికి రూ.11,111 విరాళం

డోమకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డోమకొండ అయ్యప్ప ఆలయంలో గతేడాది నుంచి నిర్వహిస్తున్న అన్నప్రసాద సేవా సమితికి డోమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, డోమకొండ అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి శ్రీనివాసుల శర్మ రూ.11,111 విరాళంగా అందించారు. ఈ మేరకు సదరు నగదును సేవాసమితి అధ్యక్షుడు తీగల సుదర్శన్‌గౌడ్‌కు అందజేశారు. అన్నప్రసాద వితరణ జనవరి 16 వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం శర్మను అభినందించారు. అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కంది వినోద్, స్వాములు మల్లికార్జున్, నరేందర్, సంతోష్, సందీప్, శ్రీనివాస్‌గౌడ్, గుడ్ల విజయ్, జాల క్రిష్ణ పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దృశ్యం

సూపరింటెండెంట్‌గా గంగా ప్రసాద్

సదాశివనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా గంగాప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సదాశివనగర్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన పూర్ణచంద్రోదయ కుమార్ బీబీపేట ఎంపీడీవో కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఆ స్థానంలో బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఇంతకాలం జక్కీలో పనిచేసిన గంగాప్రసాద్ ఇక్కడికి వచ్చారని చెప్పారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న గంగాప్రసాద్

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

గాంధారి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్ గ్రామంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సీరియల్ ప్రకారం జరుగుతాయని చెప్పారు. ప్రతి రైతు తేమ లేకుండా తూకం చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయిలు, మాజీ సర్పంచ్ బాలరాజు, సింగిల్ విండో కార్యదర్శులు గణపతి రావు, శివాజీరావు, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.


పోతంగల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

భిక్కనూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని భిక్కనూరు ఆర్‌బి అధికారులు అన్నారు. మంగళవారం మండలంలోని అంతంపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్నను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలోనే మొక్కజొన్నను విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం, రైతులు పాల్గొన్నారు.


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బి

మంత్రి పదవి రావాలని అమ్మవారి దర్శనం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అహర్నిశలు కృషి చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు మంత్రివర్గంలో చోటు దక్కాలని ఆకాంక్షిస్తూ ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మంగళవారం మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల దుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయకత్వంలో ఎల్లారెడ్డి అభివృద్ధి కొత్తరకంగా సాగుతుందన్నారు. ప్రజాపాలనలో ఎమ్మెల్యే నాయకత్వం జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పదవి వస్తే తమ నియోజకవర్గానికి మరింత బలం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు గంగారెడ్డి, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఎండీ అలీ, తదితరులు పాల్గొన్నారు.


ఏడుపాయల అమ్మవారిని దర్శించుకున్న ఏఎంసీ డైరెక్టర్లు

ఎల్లారెడ్డి యువకుడికి సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో ఇటీవల న్యాయవాదిగా పట్టా పొందిన శ్రీనివాస్‌ను మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట్ మండలంలోని మాలమాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ పట్టుదలతో ఎల్ఎల్‌బీ చదివి న్యాయవాదిగా పట్టా పొందడం అభినందనీయమన్నారు. నాయకులు కంది పద్మారావు, మానెయ్య, బాబు, ఆగమయ్య, పరువయ్య, తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉచిత ఇసుక పక్కదారి

(5వ పేజీ తరువాయి)

బీర్కూర్ మండలంలోని చించోలి, బరంగెడ్గి, బీర్కూర్‌లలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇళ్ల లబ్ధిదారులతో పాటు ప్రభుత్వ పనుల నిమిత్తమై కాంట్రాక్టర్లు షైనింగ్, స్థానిక తహసీల్దార్ల ద్వారా వే బిల్లులు తీసుకుంటూ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు.

లబ్ధిదారుల పేరిట అక్రమ రవాణా

బీర్కూర్, బిచ్కుంద మండలాల్లోని మంజీరా రీచ్ నుంచి లబ్ధిదారులు ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి ఉంది. దీనిని కొందరు అవకాశంగా చేసుకుంటున్నారు. ప్రధానంగా స్థానికంగా ఉండే చోటామోటా నేతలు, ట్రాక్టర్ల యజమానులు లబ్ధిదారుల పేరిట అనుమతులు ఉన్నా లేకున్నా దర్జాగా రవాణా చేస్తున్నారు. ఒక లబ్ధిదారుడికి ప్రభుత్వ పరంగా 10 ఇసుక ట్రాక్టర్లు తీసుకెళ్లేందుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. అయితే లబ్ధిదారునికి ట్రాక్టర్లు లేని పక్షంలో స్థానికంగా ఉండే చోటామోటా నేతలను, ట్రాక్టర్ యాజమానులను సంప్రదించి ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతి తీసుకుంటున్నారు. అయితే ఇదే అదనంగా చేసుకుని సదరు ఇసుకాసురులు లబ్ధిదారునికి 5 ఇసుక ట్రాక్టర్లు పంపించి మిగితా 5 ఇసుక ట్రాక్టర్లను పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఒకే వే బిల్లు పేరిట పదుల సంఖ్యలో అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు.

అడ్డుకుంటున్న అధికారులపైనే దురుసుగా..

ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులకు ఉచిత ఇసుకకు స్థానికంగా ఉండే రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారునికి 10 ట్రాక్టర్ల ఇసుకకు వే బిల్లులు జారీ చేస్తున్నారు. అయితే లబ్ధిదారుల ట్రాక్టర్ల నిర్వాహకులను, స్థానికంగా ఉండే చోటామోటా నేతలను ఆశ్రయిస్తూ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళ్తున్నారు. అయితే సదరు ట్రాక్టర్ నిర్వాహకులు 10 ట్రాక్టర్లకు బదులు అదనంగా తరలిస్తుండడంతో రెవెన్యూ, పోలీసు, షైనింగ్ అధికారులు అడ్డుకుంటే వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. బాన్సువాడ డివిజన్ పరిధిలో కొందరు అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండడంతో ఓ తహసీల్దార్ అడ్డుకోవడమే కాకుండా వే బిల్లులు రద్దు చేశారు. దీనిపై స్థానికంగా ఉండే చోటామోటా నేతలు సదరు అధికారిపై దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలువురిపై కేసు నమోదుచేసినట్లు తెలిసింది.

కామారెడ్డి, ఎల్లారెడ్డిలో ఇసుక కొరత

కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తీవ్రంగా ఎదురవుతోంది. దీంతో ఈ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఇసుక దొరకక కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. అయితే ఒక్కో ఇసుక ట్రాక్టర్ బహిరంగ మార్కెట్‌లో రూ.3 వేల వరకు లభ్యం అవుతోంది. కనీసం డివిజన్ పరిధిలో స్థానికంగా ఉండే వాగుల, వంకల్లో ఇసుక లభ్యం కాకపోవడంతో ఉచిత ఇసుక దొరకని పరిస్థితి. దీంతో లబ్ధిదారులు బహిరంగ మార్కెట్‌లోని ఇసుకను ఆధారపడాల్సి వస్తోంది. బయట ఇసుక ధర విపరీతంగా ఉండడంతో ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లాలోని మంజీరాలో ఎల్లారెడ్డి, కామారెడ్డి డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రత్యేక రీచ్‌ను ఏర్పాటు చేసి తక్కువ ధరకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

అందెశ్రీ మరణం సాహిత్యానికి తీరని లోటు

కామారెడ్డిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సహజకవి, వాగ్గేయకారుడు అందెశ్రీ మరణం సాహిత్యానికి తీరని లోటని తెరవే అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమేష్, శంకరయ్య అన్నారు. అందెశ్రీ మరణించడంతో ఆయనకు జిల్లా కేంద్రంలో సంతాపసభ నిర్వహించి నివాళ్లు అర్పించారు. తెరవే రాష్ట్రాధ్యుడు ఆశోక్‌కుమార్, ప్రకాశ్, శంకర్, నరసింహారెడ్డి, చలపతి, పూర్ణచంద్రరావు, మారుతి, హిరణ్మయి, రమేష్, తెరసం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదల

బాన్సువాడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో ప్రభుత్వం 100శాతం సబ్సిడీతో అందజేస్తున్న ఉచిత చేపపిల్లలను మత్స్యశాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, నాయకులు హన్మండ్లు, సాయిరెడ్డి, మత్స్యశాఖ అధికారి డోలిసింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అబుల్‌కలాం ఆజాద్‌కు నివాళి


అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

కామారెడ్డిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మహత మౌలానా అబుల్ కలాం ఆజాద్ దక్కుతుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా అందించిన సేవలు అందించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కామారెడ్డిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోషలిస్ట్ సమాజం కోసం విద్యార్థులు కంకణ బద్ధులవ్వాలని పీడీఎస్‌యూ మాజీ నాయకుడు, అడ్వకేట్ జేఏసీ చైర్మన్ జగన్నాథం పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో జరిగే మహాసభలను, ఖమ్మంలో డిసెంబర్ 5,6,7 తేదీల్లో జరిగే రాష్ట్ర 23 మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చి పోస్టర్‌లను ఆవిష్కరించారు. వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

(5వ పేజీ తరువాయి)

సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను చెక్‌చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుకకు సంబంధించి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తహసీల్దార్‌లు చర్యలు చేపట్టాలన్నారు. ఇసుకబజార్‌లు, మీసేవ వివరాలు తదితర వాటిపై దృష్టిసారించి ఇందిరమ్మ ఇండ్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. భూభారతీదరఖాస్తులు, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, సాదాబైనామాలు, అసైన్‌మెంట్ భూములు, భూమి వివరాలు వంటి అంశాలపై ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు జారీచేయబడే వివిధ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులు, ఎప్లికేషన్లు, విపత్తు నిర్వహణ చర్యలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్‌మోహన్, ట్రైని కలెక్టర్ రవితేజ, సబ్ కలెక్టర్ కిరణ్మయి, కామారెడ్డి, ఎల్లారెడ్డిఆర్డీఓలు పాల్గొన్నారు.

రైతులకు ఇక్కట్లు లేకుండా చూడాలి

కామారెడ్డిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ సూచించారు. మంగళవారం కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారి కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, తూకం విధానం, ధాన్యం నిల్వ సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో తూకం యంత్రాలు సరిగ్గా పనిచేస్తున్నాయా, తగిన బస్తాల సరఫరా జరుగుతున్నదా అనే అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు నిర్వహించాలని, తేమ శాతం ఆధారంగా నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం ఎండబెట్టే ప్రదేశాలను పర్యవేక్షించి అవసరమైన సూచనలు, సలహాలు చేశారు. రైతులకు సమయానికి చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాల్లో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు.


శిక్షణ సర్టిఫికెట్లను అందజేస్తున్న కార్పొరేషన్ చైర్మన్

మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లు

బాన్సువాడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తిచేసుకున్న 43 మంది మహిళలకు మంగళవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో మహిళలకు టైలరింగ్ పట్ల అవగాహన కల్పించడంతో పాటుగా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం మహిళలు చైర్మన్ కాసులబాల్‌రాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సంస్థ కో ఆర్డినేటర్ మంజుల, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కాలేక్, నాయకులు గోపాల్‌రెడ్డి, రమేష్, కమ్మరి రాజు, లక్ష్మాగౌడ్, అక్బర్, హన్మాండ్లు, అంజయ్య పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

కామారెడ్డిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన డిక్లరేషన్‌లో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని రాష్ట్రప్రభుత్వం అమలు చేయలేదని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో వెంకట్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కల్లుగీత కార్మిక సంఘం ముఖ్య జిల్లా మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెన్షన్ రూ.4వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచుతామని, సొసైటీ కి 5 ఎకరాల భూమి ఇస్తామని, లిక్కర్ షాప్ టెండర్లలో 25 శాతం రిజర్వేషన్స్ అమలు చేస్తామని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కానీ ఆచరణలో మాత్రం ఏ ఒక్కటి పెట్టలేదన్నారు. ఈ హామీల విషయమై అనేసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పెడచెవిన పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28వ తేదీన సూర్యాపేటలో గీతన్నల రణభేరి నిర్వహిస్తున్నామని కామారెడ్డి జిల్లా నుంచి వేలాది మంది గీత కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా 29, 30వ తేదీలలో జరిగే 4వ రాష్ట్ర మహా సభలలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి రమేష్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్య క్షుడు వెంకటనర్సయ్య, రాష్ట్రసోషల్‌మీడియా కన్వీనర్ రాజేష్ గౌడ్, జిల్లా నాయకులు యాదగిరిగౌడ్, శంకర్‌గౌడ్, రాజుగౌడ్, మోహన్‌గౌడ్, సంపత్‌గౌడ్, స్వామిగౌడ్, కనకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యం.వి.రమణ

సంక్షిప్త సమాచారం

దొంగ ఆచూకీ తెలిస్తే చెప్పండి

లింగంపేట: కామారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద ఓ బైక్ చోరీకి గురైంది. ఈ మేరకు ఎస్సై దీపక్‌కుమార్ మాట్లాడుతూ.. దొంగ ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సోమవారం సాయంత్రం కామారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద బైక్‌ను దొంగిలించుకొని వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. అతనిని గుర్తుపట్టిన వారు 871268112, 8712686113 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆరుగురు ట్రైనీ సర్వేలకు శిక్షణ తరగతులు

రామారెడ్డి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా శిక్షణ తరగతులకు వచ్చిన ఆరుగు రు సర్వేయర్లకు శిక్షణ నిర్వహించారు. భూముల కొలతలు, సర్వేలు ప్రభుత్వ ప్రైవేటు, స్థలాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవె న్యూ ఇన్ స్పెక్టర్ బద్దం రవికాంత్, సర్వేయర్ సౌమ్య, నూతన ట్రేనీ సర్వేలు తోట రాకేష్, నీలం రాకేష్, అఖిల్ గౌడ్, బండి సుమలత, లచ్చు, అక్షయ్ గౌడ్, నక్క రోహన్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో పోలీసుల తనిఖీలు

కామారెడ్డిటౌన్: కామారెడ్డి కొత్తబస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో మంగళ వారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టామని అన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పట్టణ సీఐ నరహరి పాల్గొన్నారు.

పాడి రైతులకు పాల క్యాన్లు, బ్యాగ్స్ అందజేత

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామంలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం పాడి రైతులకు పాల క్యాన్లు, బ్యాగులను మేనేజర్ సాయికుమార్ అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ డెయిరీ ప్రెసిడెంట్ లత అశోక్, మేనేజర్ రాజు, సూప ర్‌వైజర్ అశోక్, డైరెక్టర్లు లత భూమయ్య, మమత బాలు, లావణ్య సాయిబాబా, కవిత వెంకట్ స్వామి, పుష్ప భూమ య్య, హుస్సేన్, రాజయ్య, శ్రీనివాస్ పాడి రైతులు నారాయణ, నర్సింలు పాల్గొన్నారు.

రాజంపేటలో వాహనాల తనిఖీ

రాజంపేట: మండల కేంద్రంలో మంగళవారం ఎస్సై రాజు వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు ఆపి క్షుణ్ణంగా పరిశీ లించారు. వాహనదారుల లైసెన్సులను, ధృవపత్రాల ను పరిశీలించి పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబం. దనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ వాడకం, 18ఏళ్ల లోపు వారికి వాహనాలు ఇస్తే కేసులు నమోదుచేస్తామన్నారు.

ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలి

దోమకొండ: మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తిఅయ్యేలా చూడా లని మండల ప్రత్యేకాధికారి జ్యోతి అన్నారు. మంగళ వారం గ్రామకార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఇందిరాకాంతి పథకం సిబ్బంది, కారోబార్‌లతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. ఉపాధిహామీ పథకంలో ఎక్కడైతే ఇసుక దిబ్బలు వరిపొలాల్లో ఉన్నాయో వాటిని తొలగించేం దుకు తగు అంచనావేయాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉంటే ఆర్థికంగా సహాయం కోసం ఐకేపీ ద్వారా రుణాలు ఇప్పించాలని ఏపీఎంకు సూచించారు. ఎంపీడీవో ప్రవీణ్, హౌసింగ్ ఏఈ, పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

తాడ్వాయి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీకి మంగళవారం తాడ్వాయి వీడీసీ సభ్యులు వినతిపత్రం సమర్పిం చారు. చిట్యాల బోరు బావి నుండి సుమారు 5 కి.మీ. మేర పైప్ లైన్ అవసరం ఉంటుందన్నారు. దీనిని తక్షణమే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించగలరని ప్రతి పత్రం సమర్పించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

లింగంపేట: మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డీఆర్‌డీఓ సురేం దర్ పరిశీలించారు. సెంటర్ వద్ద ఉన్న స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట డీపీఎం సాయిలు, ఎంపీఎం వినోద్, సీసీ గంగరాజు, గ్రామ సంఘం అధ్యక్షురాలు రైతులు ఉన్నారు.

రైతునేస్తం కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలి

లింగంపేట: జిల్లాలోని వివిధ పంటలను సాగు చేసే రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న రైతునేస్త కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం లింగంపేట రైతువేదికలో నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి మంగళవారం ఈ కార్యక్రమం ప్రసారమవుతుందని రైతులు ఒక గంట సమయాన్ని వెచ్చించి సమా చారాన్ని తెలుసుకోవాలని ఆయన రైతులకు సూచిం చారు. ఏడీఏ లక్ష్మిప్రసన్న, ఏవో అనిల్‌కుమార్, సంతోష్, ఏఈవో రాకేష్, రైతులు పాల్గొన్నారు.


దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు


రాజంపేట: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను అమ్మకాలు జరపాలని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్గోండ గ్రామ సొసైటీ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ కంది శివరాములు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డి రూరల్: పట్టణకేంద్రంలో మునిసిపల్ కమిషనర్ మహేష్ సమక్షంలో మంగళవారం మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిం చారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది బృందం సేవా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించి 76మంది మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మొదలైన వరి కోతలు


వరి కోస్తున్న దృశ్యం


పొలంలో హార్వెస్టర్ దిగేందుకు వీలుగా రోడ్డు వేస్తున్న రైతు

దోమకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దోమకొండ, బీబీపేట మండలాల్లో వరి కోతలు జోరందుకున్నాయి. ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో రైతులు వారం రోజుల నుంచి వరి పంటను హార్వెస్టింగ్ చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చారు. మరి కొంతమంది యాసంగి పంటలకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో హార్వెస్టర్లు, ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. టార్పాలిన్లను అద్దెకు తెచ్చుకుంటూ రైతులు వరి ధాన్యాన్ని ఆరబెడుతుండటంతో అటు కిరాయి ఇచ్చే దుకాణదారులు ఉదయం 5 గంటల నుంచి మొదలుకొని రాత్రి 10 గంటల వరకు బిజీబిజీగా కనిపిస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తుండటంతో కర్షకులు పంటలను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు.

విద్యార్థులు క్రీడలను స్ఫూర్తిగా తీసుకోవాలి

● కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

కామారెడ్డి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎం క్రీడల్లో పాల్గొనే విద్యార్థి, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజాగౌడ్ అన్నారు. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పీఎం క్రీడల్లో భాగంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు శరీర దృఢత్వానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. విద్యార్థులు క్రీడల్లో గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని స్నేహభావంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. ప్రతిఒక్క విద్యార్థి క్రీడలతో పాటు చదువుల్లో కూడా ముందంజలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు, సీనియర్ ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ప్రవీణ్, రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- బాహుబలి (ది ఎపిక్)
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి మాస్ జాతర
వెంకటేశ్వర జటాధర

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230